అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people


మంగళవారం 26, మే 2026 | సంపుటి :03 | సంచిక :108 | పేజీలు :05 | వెల ₹5

18.17 లక్షల

# మొక్కలు టార్గెట్

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- వన మహోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశం
- జూన్ నెలలో వర్షాల ప్రారంభంలోనే ప్లాంటేషన్ డ్రైవ్

3





మహిళా శక్తి

# సూపర్ బజార్లు

కార్పొరేట్ స్థాయిలో
ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒకటి ఏర్పాటు

- మండలానికో రైస్ మిల్లు, పెద్ద ఎత్తున గోడౌన్ల నిర్మాణం
- జూన్ 5న మహిళా సంఘాలకు మరో 553 ఆర్టీసీ బస్సులు
- బ్యాంకు రుణాల లింకేజీ రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంపు
- 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 'ఇందిరా స్త్రీ శక్తి భవనాల'కు వర్చువల్‌గా శంకుస్థాపన

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా మహిళా సాధికారతకు దిశానిర్దేశం చేసే పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ గా రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 'ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు' శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఒకే రోజు ఇన్ని భవనాలకు శంకుస్థాపన చేసుకోవడం ఒక అద్భుత రికార్డని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- అక్షరదర్బార్, హైదరాబాద్

2

టీజీఎన్‌పీడీసీఎల్

# చరిత్రలోనే మైలురాయి

- కేయూ సబ్‌స్టేషన్‌లో తొలి 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- హనుమకొండ సర్కిల్‌లో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి కీలక అడుగు
- రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు.. ప్రారంభించిన సీఎండీ వరుణ్ రెడ్డి

2






## విద్యుత్ పై కేంద్రంతో ఒప్పందం చేసుకున్నది బీఆర్ఎస్సే

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

అక్షరదర్బార్, హనుమకొండ: సమగ్ర విద్యుత్ సరఫరా పథకంలో తెలంగాణ ప్రభుత్వం చేరడంపై బీఆర్ఎస్ నాయకులు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ 2017 జనవరి 4న ఇదే బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఢిల్లీలో ఒప్పందం చేసుకున్నదని వివరించారు. ఆ ఒప్పందంపై కేంద్రం నుంచి జాయింట్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్ వర్మ, అండర్ సెక్రటరీ నరేందర్ సింగ్ లు సంతకాలు చేయగా, రాష్ట్ర విద్యుత్ డిస్కంల నుంచి చైర్మన్లు రఘుమారెడ్డి, గోపాల్ రావు, ఎన్పీడీసీఎల్ సెక్రటరీ వెంకటేశం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా సంతకాలు చేశారని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం చేసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు చెప్పగలరా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టి, అధికారం పోగానే అహంకారంతో మాట్లాడటం బీఆర్ఎస్ నాయకులకు అలవాటైందన్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుంచుకోవాలన్నారు. ఇవాళ 50 లక్షల ఇండ్లకు 200 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా సరఫరా చేస్తున్నది కూడా రేవంత్ ప్రభుత్వమేనన్న విషయం మరిచిపోవద్దన్నారు. రైతులకు, ఇండ్లకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాక ఇక మీటర్ల ప్రస్తావన ఎక్కడిదో బీఆర్ఎస్ నాయకులే చెప్పాలన్నారు. అసత్య అరోపణలు, అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే సహించేది లేదు, ఖబర్దార్ అని బండి సుధాకర్ హెచ్చరించారు.



# మహిళా శక్తి సూపర్ బజార్లు

## కార్పొరేట్ స్థాయిలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒకటి ఏర్పాటు

- మండలానికో రైస్ మిల్లు, పెద్ద ఎత్తున గోడౌన్ల నిర్మాణం
- జూన్ 5న మహిళా సంఘాలకు మరో 553 ఆర్టీసీ బస్సులు
- బ్యాంకు రుణాల లింకేజీ రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంపు
- 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 'ఇందిరా స్త్రీ శక్తి భవనాల'కు వర్చువల్‌గా శంకుస్థాపన

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా మహిళా సాధికారతకు దిశానిర్దేశం చేసే పలు కీలక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 'ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు' శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఒకే రోజు ఇన్ని భవనాలకు శంకుస్థాపన చేసుకోవడం ఒక అద్భుత రికార్డని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కార్పొరేట్ స్థాయిలో 'మహిళా శక్తి సూపర్ బజార్లు'**

మహిళా సంఘాలు వ్యాపార రంగంలో అగ్రగామిగా ఎదగడానికి వీలుగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో సూపర్ బజార్లను ప్రారంభించనున్నట్లు సీఎం తెలిపారు. మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో అనువైన స్థలాలను గుర్తించి, మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటుకు ప్రభుత్వం కొంత కార్పస్ ఫండ్ ఇస్తుందని, దేశంలోనే అత్యుత్తమ బ్రాండ్ ఇమేజ్‌ను ఇవి సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

**ఆడబిడ్డల చేతికే రైస్ మిల్లులు, గోడౌన్లు**

కొందరు మిల్లర్లు, దళారులు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని, అందుకే ప్రతి మండలంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, పెద్ద గోడౌన్లు, లాజిస్టిక్ సెంటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. "మండలాల్లో స్థలాలు ఇచ్చే పూచీ నాది. భవిష్యత్‌లో మహిళల దగ్గరి నుంచే మిల్లర్లు ధాన్యం తీసుకెళ్లేలా వ్యవస్థను మారుస్తాం. వీటికి జీరో వడ్డీతో బ్యాంకు లింకేజీ రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.



### మహిళా సంఘాలకు సీఎం మరికొన్ని హామీలు

**మహిళా సంఘాల బ్యాంకు రుణాల లింకేజీని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంపు. మహిళా సంఘాల రుణాలపై జీరో వడ్డీ కింద ప్రభుత్వం రూ. 1,390 కోట్లు చెల్లించింది. (100% రుణాలు చెల్లించిన నిర్మల్ జిల్లా మహిళలను సీఎం ప్రత్యేకంగా అభినందించారు). మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి నెలకు రూ.70 వేల ఆదాయం వచ్చేలా ప్రణాళిక. జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ నుండి 553 బస్సుల పంపిణీ. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా ప్రభుత్వం 29 నెలల్లో రూ.10 వేల కోట్లకు పైగా సంస్థకు చెల్లించింది. మహిళలు కొత్త వ్యాపారాల్లో రాణించడానికి వీలుగా మే 29న 'వీ-హబ్' ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రారంభం.**

**పంటల మార్పిడిపై అవగాహన పెంచాలి**

ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన మహిళా ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే 'పంటల మార్పిడి' విధానం గురించి గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఇందిరమ్మ చీరల డిజైన్లను కూడా ముఖ్యమంత్రి ఈ వేదికపై నుంచే విడుదల చేశారు. మంత్రి మండలి మొత్తం మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావిస్తూ, వారు స్వశక్తితో ఎదిగే వరకు సంపూర్ణంగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

---

# టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలోనే మైలురాయి

- కేయూ సబ్ స్టేషన్‌లో తొలి 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- హనుమకొండ సర్కిల్‌లో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి కీలక అడుగు
- రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు.. ప్రారంభించిన సీఎండీ వరుణ్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న వేసవి విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు, విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా టీజీఎన్‌పీడ ీసీఎల్ ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. సంస్థ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా అత్యధిక సామర్థ్యంతో కూడిన 16 ఎంవీఏ (16 ఎంవీఏ) పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని కేయూ సబ్‌స్టేషన్‌లో సోమవారం సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారికంగా ప్రారంభించారు. సుమారు రూ.3 కోట్ల భారీ వ్యయంతో ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా హనుమకొండ నగరంలోని పలు ప్రధాన



ప్రాంతాలకు ఇకపై అత్యంత నాణ్యమైన, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా అందనుంది.

**స్థల భావానికి ప్రత్యామ్నాయంగా సామర్థ్యం పెంపు**

ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, నగర పరిధిలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి తగిన స్థలాలు దొరకడం లేదని, అందుకే ఉన్న సబ్‌స్టేషన్లలోనే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుకుంటూ వెళ్తున్నామని వివరించారు. స్థల సమస్యను అధిగమించేందుకు టౌన్ పరిధిలో ఇండోర్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, సంస్థ పరిధిలోని పలు జిల్లాల్లో ఈ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. హనుమకొండ ప్రాంతంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ ముందస్తు విస్తరణ పనులు చేపట్టినట్లు సీఎండీ స్పష్టం చేశారు.

**ఏ ఏ ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుందంటే..?**

ఈ నూతన 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడం వల్ల నగరంలోని పలు ప్రధాన ఫీడర్ల పరిధిలో విద్యుత్ లోడింగ్ సమస్యలు తొలిగిపోయి, సరఫరా మరింత మెరుగుపడనుంది. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోనే ఇంతటి అత్యధిక సామర్థ్యంతో ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు వి మోహన్ రావు, టి మధుసూదన్, హన్మకొండ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి సామ్య నాయక్, హన్మకొండ టౌన్ డీఈ సాంబ రెడ్డి, డీఈ విజయేందర్ రెడ్డి, దర్శన్ కుమార్, ఏడీఈ రాజు, సర్వేశ్ కుమార్, స్థానిక ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

## ప్రజల ఫిర్యాదులపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజల ఫిర్యాదులపై అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్వయంగా సీపీకి తెలియజేశారు. సమస్యలను విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల్లో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.



### యువ షూటర్ ను అభినందించిన సీపీ

స్పోర్ట్స్ షూటర్ గా రాణిస్తున్న కమలాపూర్ ప్రాంత వాసి, ప్రస్తుతం పదవ తరగతి పూర్తి చేసుకున్న సంగేమ్ తనిసి నూతనంగా స్పోర్ట్స్ గన్ కొనుగోలు చేయడం జరిగింది. దీనికి వినియోగించేందుకు సీపీ అనుమతి తప్పనిసరి కావడంతో సంబందించిన అధికారులతో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను సోమవారం కలుసుకోవడంతో వాస్తవానికి క్రీడాకారుడు కావడంతో యువ షూటర్ తనిసితో పోలీస్ కమిషనర్ ముచ్చటిస్తూ ఆమె సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవిష్యత్తు మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ సీపీ యువ షూటర్ ను అభినందనలు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

- వర్చువల్ గా ప్రారంభించిన సీఎం

అక్షరదర్బార్, ములుగు: తెలంగాణ ప్రభుత్వ '99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారిని ప్రేమలత ఆధ్వర్యంలో సోమవారం ములుగు మండలంలోని దేవగిరిపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆన్‌లైన్ (వర్చువల్) పద్ధతిలో ఘనంగా ప్రారంభించారు. ఉత్సాహభరిత వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. దేవగిరిపట్నం సర్పంచ్ విస్లవత్ పూలమ్మ సంతోష్, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ధాత సానికొమ్ము రోషి రెడ్డి, వార్డు మెంబర్ బాలాజీ, ములుగు ప్రాజెక్ట్ సీడీపీఓ కె శిరీష, సెక్టార్ సూపర్వైజర్లు అనంతలక్ష్మి, రమాదేవి, కమరున్నీసాబేగం, సరస్వతి, జూనియర్ అసిస్టెంట్ సంపత్ అంగన్‌వాడీ టీచర్లు వి విజయలక్ష్మి, జి కవిత, ఎల్ కవిత, ఆయా జే రోజా, తల్లులు, చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పౌష్టికాహారం, ముందస్తు విద్యకు ఈ కొత్త కేంద్రం ఎంతో దోహదపడుతుందని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# పరకాల ఆర్డీవోగా డీఎస్ వెంకన్న బాధ్యతల స్వీకరణ

అక్షరదర్బార్, పరకాల : పరకాల నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా నియమితులైన డీఎస్ వెంకన్న గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్డీవో వెంకన్న కార్యాలయ వ్యవహారాలపై సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించే దిశగా ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.



# నూతన ఆర్డీవోకు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు

అక్షరదర్బార్, పరకాల: పరకాల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. వెంకన్నను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరకాల పట్టణ శాఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అధ్యక్షుడు గాజులు నిరంజన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, నాయకుడు కుంటమల్ల గణేష్ పాల్గొన్నారు.



# ప్రతి రైతు తప్పనిసరిగా 'ఫార్మర్ రిజిస్టర్' చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సూచన

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని రైతులందరూ పీఎం కిసాన్, యూరియా బుకింగ్ మరియు ఇతర సబ్సిడీ సేవలను సులభంగా పొందడానికి తప్పనిసరిగా 'ఫార్మర్ రిజిస్టర్'లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని తెలిపారు. రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) లేదా సమీప మీ-సేవా కేంద్రాలను సంప్రదించి ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్ ద్వారా రైతుల వివరాలన్నీ డిజిటల్ రూపంలో భద్రపరచబడతాయని, దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీలు నేరుగా లభిస్తాయని వివరించారు.

# 18.17 లక్షల మొక్కలు టార్గెట్

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- వన మహోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశం
- జూన్ నెలలో వర్షాల ప్రారంభంలోనే ప్లాంటేషన్ డ్రైవ్




అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లాలో రానున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ ఎన్ రవి, ఇతర శాఖల అధికారులతో వచ్చే జూన్ నెలలో చేపట్టబోయే వనమహోత్సవ కార్యక్రమంపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 18 లక్షల 17 వేల 400 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో కేవలం డీఆర్డీఓ పరిధిలోనే 6 లక్షల మొక్కలు నాటాల్సి ఉందన్నారు.

### -పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి

మొక్కలు నాటే కార్యక్రమం కేవలం మొక్కుబడిగా సాగకూడదని, ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మొక్కలు నాటడానికి వీలుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ముందస్తుగానే గుంతలు (పిట్టింగ్) తీసి సిద్ధంగా ఉంచాలి. మొక్కలు నాటిన అనంతరం వాటి మనుగడను పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయడంతో పాటు, ఆయా ప్రాంతాల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఏ శాఖ ఎంత లక్ష్యాన్ని పూర్తి చేయాలనే దానిపై, అలాగే నర్సరీల నుండి మొక్కల తరలింపుపై స్పష్టమైన నివేదికలను త్వరగా సమర్పించాలని అన్నారు.

### వర్షాల ప్రారంభంలోనే నాటితే మంచి ఫలితాలు

జిల్లా ఇన్చార్జి అటవీ శాఖ అధికారి బి నిఖిత మాట్లాడుతూ.. వన మహోత్సవం ప్రారంభం నాటికి అన్ని నర్సరీల్లో నాణ్యమైన, బాగా పెరిగిన మొక్కలను సిద్ధం చేసి ఉంచాలన్నారు. వర్షాలు ప్రారంభమయ్యే తొలి రోజుల్లోనే మొక్కలు నాటితే అవి త్వరగా రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో వన మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన వెంటనే జిల్లాలో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తామని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# గ్రామీణ నేపథ్యంలో అందమైన ప్రేమకథ

- వేణు ఉడుగుల చేతుల మీదుగా 'సింగిల్ రాజు' గ్లిమ్స్ విడుదల
- టైటిల్ పోస్టర్, గ్లిమ్స్‌ను ఆవిష్కరించిన ప్రముఖ దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల
- యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా ఎస్.ఎస్. వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం
- విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో నిర్మాణం

అక్షరదర్బార్, హైదరాబాద్: టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, ఎస్.ఎస్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సింగిల్ రాజు'. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఫిలిం నగర్ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లిమ్స్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరై, టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు.

**కథ చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంది.. వేణు ఉడుగుల**

ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్ వర్మ, హీరో విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో, ప్యాషన్‌తో ఈ సినిమాను ప్రారంభించారు. చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. చిత్ర యూనిట్ మొత్తం కష్టపడి పనిచేస్తోంది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

– ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది.. దర్శకుడు ఎస్.ఎస్ వర్మ

దర్శకుడు ఎస్.ఎస్ వర్మ మాట్లాడుతూ.. "వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. ప్రేక్షకులను తప్పకుండా అలరించే మంచి ఎంటరటైనరగా 'సింగిల్ రాజు' నిలుస్తుందనే నమ్మకం నాకు ఉంది" అన్నారు. హీరో విశ్వస్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్ వర్మ మేము ఎంతో ప్యాషన్‌తో చేస్తున్న సినిమా ఇది. విలేజ్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు స్థానిక ప్రజలు ఎంతో సపోర్ట్ చేశారు. మా సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుకుంటున్నాను." అన్నారు. హీరోయిన్లు మౌనిక, దివ్య మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ కథలో ప్రేక్షకులకు కావలసిన అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. మాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్‌కు, సపోర్ట్ చేసిన టీమ్ అందరికీ థాంక్స్." అన్నారు.

**ఆకట్టుకుంటున్న టైటిల్ లోగో**

టైటిల్ లోగోలో కనిపిస్తున్న 'బ్రోకెన్ హార్ట్' (ముక్కలైన గుండె) ఎమోజీని బట్టి ఈ చిత్రం ఒక వైవిధ్యమైన యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్టు అర్థమవుతోంది. గ్రామీణ నేపథ్యం, దానికి తోడు గోరటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్ లాంటి ప్రముఖుల పాటలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. త్వరలోనే నటీనటులు, ఇతర విశేషాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుంది.

**సాంకేతిక నిపుణులు**

దర్శకత్వం ఎస్.ఎస్ వర్మ, పాటలు గోరటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్, ఛాయాగ్రహణం సాయితేజ కుందారపు, నితీష్, ఎడిటింగ్ యునిక్ బొజ్జపల్లి, ప్రొడక్షన్ డిజైనర్ రాజ్ మామిడి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాఘవేందర్ వర్మ, సీఈఓ శివ వర్మ సుంకరి, క్రియేటివ్ పబ్లిసిటీ గణేష్ రత్నం, పీఆర్‌వో, డిజిటల్ మమత రెడ్డి కాసం, అశోక్ దయ్యాల.

# ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను వెంటనే అప్పగించాలి

- తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ యువజన సంఘం వినతి



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను వెంటనే అంబేద్కర్ సంఘానికి అప్పగించాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో శశివర్ధన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ స్మారక భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో అప్పటి తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలో దీని నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు గడిచినా, నాటి నుండి నేటి వరకు ఆ భవనాన్ని సంఘానికి అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మహనీయుల జయంతులు, వర్ధంతులు, సంఘం సమావేశాలు నిర్వహించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోందని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి అప్పగించాలని మల్లయ్య డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు బొట్ల ఆనందం, ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, నాయకులు గురుకుంట్ల కిరణ్, మొగిలి పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో డీఈ

- రూ.50 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన శ్రీకాంత్
- హనుమకొండలోని నివాసంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- బిల్లుల జారీ, ఎంబీ బుక్ రికార్డు కోసం కాంట్రాక్టర్ నుండి డిమాండ్
- కార్యాలయంలో కాకుండా ఇంట్లోనే డీల్.. వలపన్ని పట్టిన ఏసీబీ బృందం



అక్షరదర్బార్, హనుమకొండ : అవినీతి రహిత సమాజం కోసం ఏసీబీ అధికారులు ఎంతగా నిఘా పెడుతున్నా, కొంతమంది అధికారుల లంచాల దాహం మాత్రం తీరడం లేదు. తాజాగా హనుమకొండ జిల్లాలో ఓ భారీ అవినీతి చేప ఏసీబీ వలకు చిక్కింది. పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ)గా విధులు నిర్వహిస్తున్న గంటి శ్రీకాంత్, సోమవారం నాడు రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హనుమకొండలోని భవానీనగర్‌లో గల ఆయన స్వగృహంలోనే ఈ లంచం వ్యవహారం నడుస్తుండగా అధికారులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన పలు అధికారిక పనులకు సంబంధించిన ఫైనల్ బిల్లుల జారీ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. దీనికి సంబంధించిన మెజర్మెంట్లను ఎంబీ బుక్ లో రికార్డు చేసి, బిల్లులను ముందుకు కదిలించేందుకు గాను డీఈ శ్రీకాంత్ సదరు కాంట్రాక్టర్ నుండి లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.50 వేలు ఇచ్చుకునేలా ఒప్పందం కుదిరింది. అయితే కార్యాలయంలో కాకుండా హనుమకొండ భవానీనగర్‌లోని తన నివాసానికి వచ్చి నగదు అందజేయాలని డీఈ శ్రీకాంత్ సదరు బాధితుడికి సూచించారు.

**వలపన్నిన ఏసీబీ అధికారులు**

లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధిత కాంట్రాక్టర్ ఈ విషయమై వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు పూర్తి ఆధారాలు సేకరించిన ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం సోమవారం ఉదయం నుండే నిఘా పెట్టింది. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం, సోమవారం మధ్యాహ్నం కాంట్రాక్టర్ భవానీనగర్‌లోని డీఈ శ్రీకాంత్ ఇంటికి వెళ్లి రసాయనాలు పూసిన రూ.50 వేల నగదును ఆయనకు అందించారు. శ్రీకాంత్ ఆ డబ్బును చేతిలోకి తీసుకోగానే, అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు ఒక్కసారిగా ఇంట్లోకి ప్రవేశించి డీఈని చుట్టుముట్టారు. ఆయన చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. దీంతో ఆయన తీసుకున్న లంచం సొమ్ము రూ.50 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**అధికారుల ప్రకటన**

"అవినీతికి పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. బాధితుడి ఫిర్యాదుతోనే ఈ దాడి చేశాం. డీఈ శ్రీకాంత్ నివాసంలో సోదాలు ముగిసిన అనంతరం ఆయనను అరెస్ట్ చేసి, వరంగల్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తాం." అని ఏసీబీ అధికారులు వెల్లడించారు

**నివాసంలో సోదాలు**

డీఈ శ్రీకాంత్ లంచం తీసుకుంటూ దొరికిపోయిన వెంటనే, ఆయన భవానీనగర్ నివాసంలో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు చేపట్టారు. ఆయనకు సంబంధించిన ఆస్తుల వివరాలు, గతంలో ఇరిగేషన్ శాఖలో చేసిన పనులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఇరిగేషన్ శాఖలో డీఈ స్థాయి అధికారి తన నివాసంలోనే లంచం తీసుకుంటూ దొరకడం స్థానికంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.





# పోటెత్తిన భక్తజనం

- కాళేశ్వర తీరాన భక్తి పారవశ్యం
- త్రివేణి సంగమంలో సరస్వతి అంత్య పుష్కర స్నానాలు
- 'కాళేశ్వర స్మరణం-సర్వపాప వినాశనం' అంటూ పుణ్యస్నానాలు
- శివునికి ఇష్టమైన సోమవారం కావడంతో ప్రత్యేక దానాలు, పూజలు



అక్షరదర్బార్, కాళేశ్వరం : ''కాళేశ్వర నివాసోవా, కాళేశ్వర నీరిక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం'' అనే భక్తి స్మరణలతో కాళేశ్వర క్షేత్రం మారుమోగుతోంది. పవిత్ర త్రివేణి సంగమ తీరాన సరస్వతి అంత్య పుష్కరోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన సోమవారం అంతర్వాహిని సరస్వతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమ తీరమంతా భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. పుష్కర స్నానమాచరించిన భక్తులు నదీమతల్లికి నీరాజనాలు అర్పించి, పునీతులవుతున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో కాళేశ్వరం చేరుకుంటున్నారు.

### దానాలకు పోటెత్తిన భక్తులు

పుష్కరాల మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందిస్తూ, ప్రాకృత్య ధర్మాన్ని కాపాడటమే ఈ సాంప్రదాయాల ముఖ్య ఉద్దేశం. కాగా, 5వ రోజైన సోమవారం శివునికి అత్యంత ఇష్టమైన రోజు కావడంతో త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించిన భక్తులు పెద్ద ఎత్తున దానధర్మాలు చేశారు. నది తీరంలో దానం చేయడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని భక్తులు నమ్ముతారు.

### అధికార యంత్రాంగం అలర్ట్

భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం నిరంతరం సేవలందిస్తోంది. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా పుష్కర ఘాట్ల వద్ద అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. భక్తులు నది లోపలికి వెళ్లకుండా ఘాట్ల వెంబడి బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రమాద నివారణ కోసం గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను రంగంలోకి దించారు. ఘాట్ల వద్ద లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచి అధికారులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. మహదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం భక్తుల జయజయధ్వానాలు, వేదమంత్రాల సాక్షిగా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది.



